క్లుప్తంగా

ఆటోయూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

మక్కువ: మండలకేంద్రం మక్కువలో బుధవారం దుర్గా ఆటోయూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఆటోయూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేసి, వివిధ పనులపై మండల కేంద్రానికి చేరుకునే ప్రజల దాహార్తిని తీర్చడం అభినందించదగిన విషయమని ప్రశంసించారు.

వేసవి ఎద్దడికి గురికాకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుమూర్తి

బలిజిపేట: ఉపాధి వేతనదారులు వేసవి ఎద్దడికి గురికాకుండా చూడాలని ఎంపీడీఓ భానుమూర్తి సూచించారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి పనుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అందులో భాగంగా పని వద్ద టెంట్లను ఏర్పాటుచేయాల్సిన బాధ్యత మేట్లదని స్పష్టం చేశారు. అదేవిధంగా మెడికల్ కిట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు అందజేయాలని, తాగునీటిని వేతనదారులే తెచ్చుకోవాలని అది వారి బాధ్యత అని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన ఉన్నదీ లేనిదీ ఏపీఓ పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ వద్దు.. ప్రభుత్వ కళాశాలే ముద్దు


అడ్మిషన్ డ్రైవ్‌లో పాల్గొన్న అధ్యాపకులు

పార్వతీపురం టౌన్: ప్రైవేట్ కళాశాలలు వద్దు.. ప్రభుత్వ కళాశాలలే ముద్దు అని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో, మండలంలో అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణం, చుట్టుపక్కల గ్రామాలలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను కళాశాల జూనియర్ లెక్చరర్లు కలిసి కళాశాలలోని సదుపాయాలు, సౌకర్యాలు, బోధన–అభ్యసన కార్యక్రమాల గురించి వివరించామని తెలియజేశారు. ఉచిత పుస్తకాల సరఫరా, అమ్మఒడి పథకం, నాడు నేడు కార్యక్రమం ద్వారా కళాశాల ఆధునికీకరణ, డిజిటల్ బోధన మొదలైన వాటి గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్ కలిగి ఉన్న కరపత్రాలను పంచి పెడుతూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కళాశాలలోని సదుపాయాలు సౌకర్యాలను ఫొటోల రూపంలో చూడవచ్చని విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిలేని పిల్లలకు ఆర్థికసాయం

జియ్యమ్మవలస: మండలంలోని కొండచిలకాం పంచాయతీ డ్రాక్షణి గ్రామానికి చెందిన నిమ్మక జ్యోతి అనారోగ్యంతో మరణించింది. దీంతో ఇద్దరు పిల్లల పోషణకు భర్త నాగేశ్వరరావు ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నిమ్మక గణేష్‌తో పాటు సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు రూ.6 వేలు నగదుతో పాటు రెండు క్వింటాళ్ల బియ్యం బుధవారం అందజేశారు. ప్రభుత్వం, దాతలు ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరుతున్నారు.

నేడు పెదరామలో 'గడపగడపకు..'

సీతంపేట: మండలంలోని పెదరామ గ్రామసచివాలయం పరిధిలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ కె.సత్యం బుధవరాం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

గోపాలపురంలో వైఎస్సార్ కంటివెలుగు

పాలకొండ: మండలంలోని గోపాలపురం గ్రామంలో బుధవారం వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 60 ఏళ్లు దాటిన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో కంటి వైద్యనిపుణులు టి.కృష్ణారావు ఆధ్వర్యంలో 62 మందికి పరీక్షలు చేసి 32 మందికి కళ్లద్దాలకు, 16 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి, కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. వైద్య సిబ్బంది ప్రియాంక, ఎస్.హైమావతి, ఆర్.శ్రీనివాసరావు శిబిరంలో సేవలందించారు.

ఆస్పత్రుల్లో జరిగే ప్రమాదాలపై అవగాహన

పార్వతీపురంటౌన్:


జిల్లా ఆస్పత్రి ఆవరణలో ప్రమాదాలపై డెమో ఇస్తున్న సిబ్బంది

ఆస్పత్రుల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక శాఖ బుధవారం ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించింది. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఆస్పత్రుల్లో ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంపై అగ్నిమాపక అధికారి యు.సుధాకరరావు, సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి సుధాకరరావు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఎప్పుడైనా అగ్ని ప్రమాదం జరిగితే అప్రమత్తం కావాలని హితవు పలికారు. అగ్నిప్రమాదం సంభవించిన వార్డు లేదా ప్రదేశం నుంచి మిగిలిన వార్డులకు విస్తరించకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సూచించారు. ప్రమాదం జరిగిన వార్డులోని రోగులను మెట్ల మీద నుంచి సురక్షిత ప్రదేశానికి తరలించాలని, లిఫ్టును వినియోగించరాదని పేర్కొన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక పరికరాలు ఉపయోగించడం వల్ల ప్రమాదాన్ని నివారించవచ్చన్నారు. ఇందుకోసం అవగాహన, అనుభవం కలిగిన సిబ్బంది అవసరమని అభిప్రాయపడ్డారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు పొగ బారినుంచి తప్పించుకునేందుకు చేతిరుమాలు తడిపి ముక్కుకు కట్టుకోవాలని పేర్కొన్నారు. తద్వారా ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చన్నారు. మహిళలు వంట గ్యాస్ వాడేటప్పుడు గాలి వెలుతురు వచ్చే ప్రదేశాల్లోనే గ్యాస్ వాడాలని, 6 మాసాల కొకసారి గ్యాస్ ట్యూబ్ మార్చుకోవాలని, గ్యాస్ సిలిండర్ చుట్టూ ఏవిధమైన ప్రమాదకర వస్తువులు ఉంచరాదని ఆయన అన్నారు. వేసవిలో ఎండ తీవ్రత, వాతావరణంలో మార్పుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తద్వారా అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి, అగ్నిమాపక శాఖ లీడింగ్ ఫైర్ మెన్ టి.ఉమామహేశ్వరరావు, ఎ.రమేష్, బి.ప్రసాద రావు, సిబ్బంది ఎల్.మోహనకుమార్, టి.త్రినాథరావు, ఎ.బాబా, రాజు, డి.సురేష్ పాల్గొన్నారు.


కరపత్రాలతో అధికారులు, వైద్యులు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

సాలూరు: అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించుకోవాలని సాలూరు పట్టణ అగ్నిమాపకశాఖ అధికారి పైడిరాజు సూచించారు. అగ్నిమాపకవారోత్సవాల్లో భాగంగా బుధవా రం పట్టణంలోని ఫిలడెల్ఫియా కమ్యూనిటీ ఆస్పత్రి వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా వివరించారు.ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవించే అవకాశం ఉంది? సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను కూలంకుషంగా వివరించారు. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక శాఖ పనితీరును ఆస్పత్రి అధికారులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అధికారులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయి పనులు వేగవంతం చేయాలి


అంటిపేట కాలనీలో పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి శ్రీరాములు

సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామంలో జరుగుతున్న ఇంటింటి కుళాయిల పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేయడానికి నిర్వాహకులు సిద్ధం చేయాలని జెడ్పీటీసీ ఎం బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి శ్రీరాములు కోరారు. ఈ మేరకు బుధవారం అంటిపేట కాలనీలో జరుగుతున్న ఇంటింటి కుళాయి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేసిన కృషి ఫలితంగా జేజేఎం గ్రాంట్‌ద్వారా రూ.37 లక్షల అంచనాతో ప్రతిపాదించగా ప్రభుత్వం రూ.33 లక్షలు మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ మేరకు గ్రామంలో 350 ఇంటింటికుళాయిల ఏర్పాటుకు అవసరమైన ప్రధాన పైప్‌లైన్ వేయడం పూర్తయిందని ఇప్పటికే 350 ట్యాప్‌లు అమర్చినట్లు చెప్పారు. నిర్వాహకుడు అచ్యుతరావు మాట్లాడుతూ పనులు పూర్తి కావస్తున్నాయని ఓవర్‌హెడ్ ఉన్న ఉన్న కాలనీకి పైప్ జాయింట్లు వేసి వారం రోజుల్లో తాగునీరు పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నామన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఉన్న కాలనీకి రెండు వారాల్లో తాగునీరు సరఫరా చేయడానికి సిద్ధం చేస్తామని చెప్పారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ఇంటింటి కుళాయిలను ప్రారంభించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఎంపీటీసీ ఎస్.నిర్మల, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్లను నెలాఖరులోగా పూర్తిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా, గోడలు నిర్మించిన ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి లబ్ధిదారులపై ఇంజినీరింగ్ సహాయకులు ఒత్తిడి తేవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ జేఈ జనకీరాం అధ్యక్షతన ఇంజినీరింగ్ సహాయకులతో గృహనిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి ఇంటికోసం–రోజుకోగంట విధానాన్ని అమలు చేసినట్లు చెప్పారు. ఇంజినీరింగ్ సహాయకులు ఇంటి కోసం –గంట సమయం కేటాయించి ప్రతి లబ్ధిదారుడితో మాట్లాడి పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయించాలని స్పష్టం చేశారు. అలాగే ఇల్లు నిర్మించడానికి ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు వెలుగు పథకం ద్వారా రూ.30 వేల రుణం సమకూర్చినట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

విజయవంతంగా జగనన్నే మా భవిష్యత్తు


సీతానగరం: సుమిత్రాపురంలో'జగనన్నే మా భవిష్యత్తు'పీపుల్స్ సర్వే నిర్వహిస్తున్న జెడ్పీటీసీ ఎం బాబ్జీ, బి. శ్రీరాములు


బలిజిపేట: పెద్దింపేటలో ఇంటింటికీ తిరుగుతున్న కన్వీనర్లు, గృహసారథులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు''మా నమ్మకం నువ్వే జగన్' పీపుల్స్ సర్వే విజయవంతంగా జరుగుతోందని జెడ్పీటీసీ ఎం బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు అన్నారు. ఈ మేరకు బుధవారం వారు సుమిత్రాపురంలో సర్పంచ్ బి.నందిని ఆధ్వర్యంలో జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు' పీపుల్స్ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు మండలంలోని అన్నిగ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లుతో కలిసి'జగనన్నే మా భవిష్యత్తు' పీపుల్స్ సర్వే కార్యక్రమాలు జరుగు తున్నాయన్నారు. కార్యక్రమంలో బి.ఉమామహేశ్వరరావు, ఎం భాస్కరరావు, గృహసారథులు పాల్గొన్నారు. అలాగే గెడ్డలుప్పిలో సర్పంచ్ అల్లు తిరుపతినాయుడు, ఎంపీటీసీ సత్యనారాయణల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కె శ్రీరాములు, ఉప సర్పంచ్ సొంగల అమ్మడమ్మ, డి.సన్యాసి, జి.గౌరి, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమం

బలిజిపేట: జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమ ఫలాలు సాధ్యమవుతాయని ఎంపీటీసీ సాంబమూర్తి అన్నారు. మండలంలోని పెద్దింపేటలో ఎంపీటీసీ సాంబమూర్తి, నాయకులు, కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సాంబమూర్తి మాట్లాడుతూ అటువంటి నాయకుడిని మళ్లీ మనం ఆశీర్వదించి రెండవసారి ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. పథకాలు అందని వారు ఉంటే చెప్పాలని ఇంటింటికీ తిరిగిన సందర్భంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా మద్దతు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిచడం ఓ వరం

- వైద్యాధికారి శ్రీకాంత్


వెంకంపేట గ్రామంలో వైద్యశిబిరం

పార్వతీపురంటౌన్: గ్రామాల్లో వైద్య సేవలు అందిచడం ఓ వరమని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని పెంకంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలకు మంచి స్పందన వస్తోందన్నారు. వైద్యశిబిరంలో అన్ని రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. అందుబాటులో 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రోగులను కుటుంబసభ్యుల్లా చూస్తున్నామని, రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులను నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

లచ్చయ్యపేట చర్చిలో ముగిసిన ఉజ్జీవ క్రైస్తవ సభలు


ఉజ్జీవ మహా సభలో పాల్గొన్న బ్రదర్స్ గాస్పల్, జార్జ్, మాథ్యూస్

సీతానగరం:

మండలంలోని లచ్చయ్యపేట అసెంబ్లీ చర్చిలో మూడు రోజులుగా జరుగుతున్న ఉజ్జీవ క్రైస్తవ మహాసభలు బుధవారం సాయంత్రం ముగిశాయి. ఈ మేరకు చర్చి గాస్పల్ బ్రదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రదర్ జార్జ్ మాథ్యూస్ మాట్లాడుతూ సర్వ మానవ సోదర భావాన్ని చాటే క్రీస్తు ప్రేమ సందేశాన్ని వినిపించే వేదికగా ఉజ్జీవ సభలు నిలిచాయన్నారు. గాస్పల్ బ్రదర్ మాట్లాడుతూ లచ్చయ్యపేట చర్చి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉజ్జీవ మహసభలు స్థానిక సంఘ కాపరి,విశ్వాసులు, గ్రామ పెద్దలు, సంఘ పెద్దలు, స్థానిక సంఘ సభ్యుడు బాబ్జీ పరస్పర సహకారంతో ఘనంగా జరిగాయన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలపై అవగాహన కల్పించుకోవాలి


మాట్లాడుతున్న డీఐఓ టి.జగన్మోహనరావు

సీతానగరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందజేస్తున్న వైద్యసేవలపై ప్రజలందరూ అవగాహన కల్పించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని ఇప్పలవలసలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన పలు అనారోగ్యసమస్యలతో శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై అవగాహన కల్పించారు. సాధారణ ఆరోగ్య సమస్యలు, గర్భిణులు, స్త్రీల ఆరోగ్య పరీక్షలు, బాలింతలు, నవజాత శిశువులు, చిన్నారులకు ఆరోగ్య పరిరక్షణ సేవలు అందిస్తారన్నారు. అలాగే కౌమార దశ పిల్లలకు ఆరోగ్య పర్యవేక్షణ, గర్భనిరోధక, పునరుత్పత్తి ఆరోగ్యసేవలు, అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, క్షయ, కామెర్లు వ్యాధుల నివారణ చర్యలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ సేవలు అందుతాయని తెలిపారు. ఇంకా మానసిక ఆరోగ్యసేవలు, పోషకాహార సేవలు అదేవిధంగా క్షేత్రస్థాయిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొంది ఇళ్లకు చేరిన రోగుల ఆరోగ్య పర్యవేక్షణ, కదల లేని పరిస్థితిలో ఉన్న రోగుల గృహ సందర్శన, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు సందర్శించి పిల్లలు, విద్యార్థుల ఆరోగ్య తనిఖీలు, వైద్య సేవలపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకుని వినియోగించుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా కుటుంబ వైద్య సేవలు అందించే సిబ్బంది మొబైల్ నంబర్లన్నీ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాల వద్ద ప్రదర్శించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ లక్ష్మణరావు, ఎంపీటీసీ గుళ్ల సంతోషికుమారి, జి.శంకరరావు, సూపర్ వైజర్లు భవాని, జయగౌడ్, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య' దరఖాస్తుల స్వీకరణకు కొర్రీలు

వీరఘట్టం: తల్లిదండ్రులు లేని 19 ఏళ్లలోపు వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు నెలకు రూ.4 వేలు చొప్పున అందించనున్నారు. అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కూడా ఆహ్వానిస్తోంది. అయితే ఇటీవల కేజీబీవీలో, సంక్షేమ వసతి గృహాల్లో 10వ తరగతి పూర్తిచేసిన కొందరు విద్యార్థు లు ఈ పథకానికి దరఖాస్తు చేయగా.. అధికారులు వారి దరఖాస్తులను తిరస్కరించడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీల్లో చదివినప్పటికీ ప్రస్తుతం తాము నిరాశ్రయులుగా ఉన్నామని, తమ పరిస్థితిని అర్థం చేసుకుని వాత్సల్య పథకానికి తమ దరఖాస్తులు స్వీకరించాలని వారంతా కోరుతున్నారు. ఈ విషయాన్ని సాక్షి విలేకరి జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు వెంటనే స్పందించి 32 మంది దరఖాస్తులను స్వీకరించేందుకు అంగీకరించారు. వెంటనే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు వీరఘట్టం మండలంలో 413 మంది దరఖాస్తులు ఆన్‌లైన్ చేసినట్లు సీడీపీఓ పూర్ణిమ తెలిపారు

మస్తర్ల నమోదులో తప్పులు చేయొద్దు

భామిని: ఉపాధిహామీ పనులకు వచ్చే వేతనదారుల మస్తర్ల నమోదులో తప్పులు ఉండరాదని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు అన్నారు. బాలేరులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎండలు పెరుగుతున్నందున పని ప్రదేశంలో తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలన్నారు. మస్తర్లలో దిద్దుబాటు వద్దన్నారు. ఉదయం, సాయంత్ర సమయాల్లో పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

సచివాలయ సేవలు మెరుగుపడాలి

బామిని: మండలంలోని ఘనసర, నల్లరాయిగూడ, లివిరి గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు బుధవారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, మెరుగైన సేవలందించేందుకు కృషిచేయాలన్నారు.

23న తాడికొండలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో ఈనెల 23న రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరామ్మూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో నిపుణులైన జనరల్, కంటి, చర్మవ్యాధులు, ఎముకలకు సంబంధించి వైద్య నిపుణులు వైద్య సేవలందిస్తారన్నారు. వైద్య శిబిరంతో పాటు ఎంపిక చేసిన 100 నిరుపేద గిరిజన కుటుంబాలకు వంట పాత్రలు, వ్యక్తిగత పరిశుభ్రత సామగ్రి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్యాంకులతో తాగునీరు సరఫరా

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీలో రక్షిత మంచినీటి పైపులైను మరమ్మతులకు గురికావడంతో అన్ని వీధులకు ట్యాంకుల ద్వారా తాగునీరు సరాఫరా చేస్తున్నామని ఈఓ వి.రామచంద్రరరావు తెలిపారు. పైపులైను బాగు చేసేందుకు కావాల్సిన సామగ్రి విజయవాడ నుంచి రావాల్సి ఉందని, సామగ్రి వచ్చిన వెంటనే మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. అంతవరకు ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.

మండుతున్న ఎండలు


మండుటెండలో పాదరక్షలు, గొడుగు వేసుకుని వెళ్తున్న మహిళలు

సీతానగరం: సూర్య భగవానుడి ప్రతాపం వల్ల ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బుధవారం మధ్యాహ్నానికి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు.

ఎండలు తీవ్రంగా ఉంటాయని, వడ గాడ్పుల కారణంగా ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావద్దని రెండు రోజులుగా వస్తున్న ప్రభుత్వాదేశాల మేరకు అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విధిలేని పరిస్థితిలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఉపాధి హామీ వేతన దారులు కాళ్లకు చెప్పులు, గొడుగులతో పనులకు వెళ్తున్నారు.